భూసార పరీక్ష.. పంటకు రక్ష

- మట్టి పరీక్షలతో ఎన్నో ఉపయోగాలు
- ఫలితాల ఆధారంగా వంటసాగు చేస్తే మంచి ఫలితాలు


వడమాలపేట మండలంలో భూసార పరీక్ష చేస్తున్న ఏవో

విజయపురం : భూమి మిశ్రమ సమ్మేళనం. ఇందులో ఖనిజ లవణాలు, పోషకాలుంటాయి. ఇవే మొక్కల ఎదుగుదలకు ఆధారం. అయితే అధిక దిగుబడులు సాధించాలని రానురాను రసాయన ఎరువులు విపరీతంగా వినియోగించడంతో భూమి సారం కోల్పోతోంది. సరైన పోషక విలువలు లేకపోవడం వల్ల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పొలంలో ఆరోగ్యకరమైన పంట పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి.

భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. సూక్ష్మపోషకాల లోపాలను తెలుసుకోవడంతోపాటు భూమిలో ఏ పోషకాలు క్షీణించి ఏమి లోపించాయనే అంశాలు భూసార పరీక్షల ద్వారా తెలుస్తాయి. సేంద్రియ కర్బనం తగ్గితే పచ్చిరొట్ట పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవచ్చు.

సూక్ష్మపోషకాలే కీలకం

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయన ఎరువుల వల్ల భూమిలోని పోషకాలు నశించిపోతాయి. పొటాషియం ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందకుండాపోతాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. సూక్ష్మ పోషకాలతో పాటు నైట్రోజన్ సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది. పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలల్లో భౌతిక రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

మట్టి పరీక్షలతో ఉపయోగాలు

- మట్టి పరీక్షల్లో ఆమ్ల, క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకొని సాగు చేసిన పంటకు వయసు, కాలాన్ని అనుసరించి ఎరువులను సమపాళ్లలో అందించవచ్చు.
- ఆమ్ల గుణం ఉన్న నేలకు సున్నం, క్షార గుణం ఉన్న నేలలను జిప్సంతో బాగు చేసుకోవచ్చు.
- నేలలో సహజంగా ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకుని సాగు చేసే పంటలకు ఎరువుల మోతాదును నిర్ణయించుకోవచ్చు.



- నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకుని ఏ నేలలో ఏపంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకోవడానికి వెసులుబాటు ఉంటుంది.
- సాగు చేసిన పంటకు నేలతో తగు నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్ష ద్వారా తగ్గిన పోషకాలను అందించి దిగుబడులు పెంచుకోవచ్చు.
- వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగాలంటే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.

భూసార పరీక్షలు ఎంతో మేలు



పది రోజులుగా పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నాం. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులకు అధిక దిగుబడులు వస్తాయి. ఈ సంవత్సరం కూడా రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుంది.

– విజయ్‌కుమార్, వ్యవసాయాధికారి, వడమాలపేట

ఆకట్టుకున్న అర్జున తపస్సు


తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున వేషధారి

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంటలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం ఆకట్టుకుంది. అర్జునుడు శివతత్వ గీతాలను ఆలపిస్తూ తపస్మాన్‌ను అధిరోహించే ఘట్టం ఆకట్టుకుంది. సంతాన ప్రాప్తి కోసం మహిళలు వరపడ్డారు.

కార్వేటినగరం : మండల పరిధిలోని అమ్మపల్లి గ్రామ సమీపంలోని ద్రౌపదీ దేవీ సమేత ధర్మరాజుల ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు ఘట్టం ఆకట్టుకుంది. ద్రౌపదీ దేవీ ఉత్సవ మూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధులలో ఊరేగించారు. అనంతరం తపస్మాన్ అధిరోహించే ఘట్టం ఆకట్టుకుంది.

క్లుప్తంగా

సేవలు స్ఫూర్తిదాయకం


డీటీ కోమలను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి

వెదురుకుప్పం : మండల ప్రజలకు డిప్యూటీ తహసీల్దార్ కోమల స్ఫూర్తిదాయకమైన సేవలు అందించారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి ప్రశంసించారు. వెదురుకుప్పం డీటీ కోమల బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం వెదురుకుప్పంలో సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోమలను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు అత్తూరు భీమ శంకర్‌రెడ్డి, నాయకులు లోకేశ్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, లోకనాథం, పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌మురళీ, దేవరాజారెడ్డి, ఆర్‌ఐ జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రావి, వేప చెట్ల కల్యాణోత్సవం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వెదురుకుప్పం : మండలంలోని దామరకుప్పం (రైస్ మిల్) వద్ద బుధవారం రావి, వేప చెట్ల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహా విష్ణు స్వరూపులైన రావి, వేప చెట్టుకు శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, టీకేఎంపురం మాజీ సర్పంచ్ హేమశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో కల్యాణంతో పాటు భక్తులకు అన్నదానం చేపట్టారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం : మండల కేంద్రంలోని ఐటీఐలో 2025–26కు గాను మొదటి విడత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ భైరవుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఐటీఐలో కోపా, డ్రస్‌మేకింగ్, ఎలక్ట్రీషియన్ ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఆసక్తి గల అభ్యర్థులు మే నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 24 నుంచి 26వ తేదీ లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెదురుకుప్పం ఐటీఐ నందు వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు మెరిట్ ఆధారంగా జూన్ 2 నుంచి 10వ తేదీ లోపు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులకు ఎలాంటి కాల్ లెటర్‌లు పంపడం లేదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 95337 23022, 94925 71731 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సీనియర్ అసిస్టెంట్‌కు మేనేజర్‌గా ఉద్యోగోన్నతి


చంద్రకాంత్

నగరి : మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రకాంత్ మేనేజర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. కడప జిల్లా, జమ్మలమడుగు మున్సిపాలిటీ మేనేజర్‌గా పదోన్నతిపై ఆయన బదిలీ కానున్నారు. పదోన్నతి పొందిన సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ద్రౌపదీ ఆలయ కుంభాభిషేక పూజలు



పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం గ్రామంలో వెలసిన ద్రౌపది అమ్మవారి ఆలయ ముఖద్వార మహాకుంభాభిషేకం బుధవారం వైభవంగా సాగింది. వేదపండితులు వివిధ యాగశాల పూజలు నిర్వహించారు. అనంతరం కోలాట కార్యక్రమం చేపట్టారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

గుడిపాల: మండలంలోని వసంతాపురం గ్రామంలో బుధవారం మహాభారత యజ్ఞం ఘనంగా ప్రారంభించారు. ఉదయం ద్రౌపది, ధర్మరాజుల ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి వేదపండితుల మధ్య ఘనంగా పూజలు చేశారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ బాలాజీ నాయుడు గారిచే ధ్వజారోహణం నిర్వహించారు. ధర్మరాజుల గుడివద్ద నుంచి ద్రౌపది, భీమ, అర్జున, నకుల, సహదేవ, అభిమన్యుడు, సుభద్ర, శ్రీకృష్ణుడు విగ్రహాలను మహాభారత యజ్ఞం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మధ్యాహ్నం 2గంటలకు హరికథా భాగవతార్ వినయ్‌ప్రసాద్‌రెడ్డి హరికథా గానం చేశారు.

నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు


మాట్లాడుతున్న చైర్మన్ హరి

పుత్తూరు: వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎ.హరి తెలిపారు. చైర్మన్ హరి అధ్యక్షతన బుధవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో కశ్మీర్‌లో ఉగ్రదాడిలో కన్నుమూసిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణ జనాభా 60 వేలు దాటుతుండగా, పలు విద్యా సంస్థలకు వచ్చే విద్యార్థులు మరో 20 వేల మంది వరకు ఉంటారని దీంతో పట్టణంలో పారిశుద్ధ్యం కుంటుపడుతోందని తెలిపారు. దీనిని అధిగమించడానికి సిబ్బందిని పెంచాలని సూచించారు. అజెండా రూపొందించేటప్పుడు కౌన్సిలర్ల అభిప్రాయాలను సైతం తీసుకోవాలని సూచించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ జీవరత్నం నాయుడు మాట్లాడుతూ చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన 13 ఎలక్ట్రికల్ వాహనాల్లో 6 మాత్రమే పనిచేస్తున్నాయని, మరమ్మతులకు గురైన వాటిని సైతం వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ మంజునాథగౌడ్, వైస్ చైర్మన్ జయప్రకాష్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న భక్త సమాజం వారు

నగరి : మున్సిపల్ పరిధి చావడి ప్రాంతంలో అయ్యప్ప భక్త సమాజం వారు పాదచారులకు బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. మండుటెండల్లో రోడ్డుపై వెళ్లేవారికి మజ్జిగ అందించి ఉపశమనం కలిగించారు. టీటీడీ పర్యాటక బస్సులో వచ్చిన ప్రయాణికులు కూడా శిబిరం వద్దకు విచ్చేసి మజ్జిగ తాగి సేదతీరారు. ఈ కార్యక్రమంలో భక్తసమాజానికి చెందిన మధన్, గోపి, రవి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

పుత్తూరు: స్థానిక నగరం రోడ్డు కూడలిలో పూర్వ విద్యార్థులు బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం మినరల్ వాటర్‌తో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మురళి, చంద్ర, లక్ష్మణ్, ఆనంద్, రాజా, హేమంత్, సురేష్, గోవర్ధన్, ఏకాంబరం పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో నడివీధి గంగమ్మ

కార్వేటినగరం : మండల పరిధిలోని రాజులకండ్రిగలో రెండు రోజుల పాటు నిర్వహించిన గంగమ్మ జాతర బుధవారం వైభవంగా ముగిసింది. మంగళవారం సాయంత్రం నడివీధి గంగమ్మ ఆలయ ఆవరణలో మహిళలు అమ్మవారికి అంబళ్లు పోశారు. అనంతరం పొంగళ్లు వండి పిండి దీపాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారిని సుందరంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం వేకువ జామున ఆలయానికి చేరుకున్న అమ్మవారికి భక్తులు జంతు బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో యువత అఘోరా వేషధారణతో గ్రామ వీధుల్లో ఊరేగుతూ ఆకట్టుకున్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.


అఘోరా వేషధారణలో యువత

రంగనాథరెడ్డి సేవలు ఆదర్శం



రంగనాథరెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, అన్నదానం చేస్తూ..

శ్రీరంగరాజపురం : మండలంలోని 49 కొత్తపల్లి మిట్టకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రంగనాథరెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన గొప్ప నాయకుడన్నారు. వైఎస్సార్‌సీపీకి రంగనాథరెడ్డి చేసిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయా బాబు, మాజీ మార్కెట్ కమిటీ సభ్యులు గోవింద రెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కాలప్ప, యువ నాయకులు స్కైలా, శ్యామ్ నాయకులు భూపతిరెడ్డి, జనార్దన్, కోటిరెడ్డి బాబు, సుధ, యుగంధర్, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రాజు సేవలు ఆదర్శనీయం


ప్రభాకర్‌రాజును సత్కరిస్తున్న అధికారులు

పుత్తూరు: ప్రధానోపాధ్యాయులుగా, ఎంఈఓగా, డీవైఈఓగా ప్రభాకర్‌రాజు సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలువురు ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఆయన్ని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

రైతులు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి


రీ సర్వేపై ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

పాలసముద్రం : ప్రభుత్వం చేపడుతున్న రైతులు భూసమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. బుధవారం వనదుర్గాపురం పంచాయతీల్లో రీసర్వే కార్యక్రమం చేపట్టారు. రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం రీ సర్వే చేపట్టారని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గణేష్, వీఆర్‌ఓ తంగరాజ్, విలేజ్ సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

గృహ ప్రవేశ మహోత్సవంలో మాజీ డిప్యూటీ సీఎం


మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామితో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత స్కైలా

శ్రీరంగరాజపురం : మండలంలోని 49 కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత స్కైలా నూతన గృహాన్ని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని స్కైలా ఘనంగా సన్మానించారు.

మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ

కార్వేటినగరం : వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎస్.కే.మున్నా మాతృమూర్తి భుజాన్(92) రెండు రోజుల కిందట మృతి చెందింది. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి బుధవారం ముస్లిం కాలనీకి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటానని ఆయన భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బాలాజీ , స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ముస్లిం నాయకులు హమీద్‌ఖాన్, ఇర్షాద్‌ఖాన్, రఫీ, సమీర్, జైలా, ఇమ్రాన్, సైఫ్, తహీర్‌ఖాన్ ఉన్నారు.

మాజీ మంత్రి రోజా బిజీబిజీ


మాజీ మంత్రి రోజాను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ అధ్యక్షులు

పుత్తూరు: మాజీ మంత్రి ఆర్కే రోజా బుధవారం పలు కార్యక్రమాల్లో రోజంతా బిజీ బిజీగా గడిపారు. ఉదయం పుత్తూరు మున్సిపాలిటీ 10వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గురవయ్య నూతన గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలరెడ్డి కుమారుని వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం తిరుపతిలో జరిగిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి కుటుంబ వివాహ రిసెప్షన్‌లో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట సోదరుడు కుమార్‌స్వామి రెడ్డి తోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

రోజాకు ఆత్మీయ సత్కారం

వడమాలపేట (విజయపురం): వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమితులైన మాజీ మంత్రి ఆర్కే రోజాను వడమాలపేట మండల యూత్ అధ్యక్షుడు భారత్‌కుమార్‌తో పాటు, 22 మంది అనుబంధ విభాగ అధ్యక్షులు ఆమెను సత్కరించారు. గురువారం వైస్ సర్పంచ్ ఇంటిలో ఆమెను పూలదండలు, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హరీష్, గణేష్, బాలముని, ముస్తాఫ, గణేష్ తదితరులు ఉన్నారు.



పుత్తూరు: గృహప్రవేశ మహోత్సవంలో మాజీ మంత్రి రోజా, తిరుపతి: వివాహ రిసెప్షన్ వేడుకలో రోజా, వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నియామకాలు

కార్వేటినగరం : గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగంలో పలువురికి పదవులు కేటాయిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. లీగల్‌సెల్ అనుబంధ విభాగాల అధ్యక్షుడిగా స్టీఫెన్, డాక్టర్ విభాగం అధ్యక్షుడిగా ప్రకాష్, ఆర్టీఐ విభాగానికి డిల్లీకుమార్‌ను నియమించినట్లు ప్రకటనలో పేర్కొంది.